# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 262
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
జూలై 19, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## మెట్రో రైళ్ల తయారీకి అనువైన ప్రాంతం

- రూ.521 కోట్లతో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్
- 2026 చివరి నాటికి ప్రాజెక్ట్ మొత్తం పూర్తి
- కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

# ఊపిరి ఆడడం లేదు



- 36వ డివిజన్ పుప్పాల గుట్టలో ఇష్టారాజ్యం
- డంపింగ్ యార్డ్ గా శ్మశానవాటిక
- పొగతో ఊపిరాడని పరిస్థితి
- దుర్గంధం బారిన చుట్టుపక్కల ప్రాంతాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



నగరంలోని 36వ డివిజన్ పుప్పాల గుట్ట శ్మశానవాటికను గ్రేటర్ వరంగల్ శానిటేషన్ అధికారులు డంపింగ్ యార్డ్ గా మార్చారు. గత కొన్ని రోజులుగా ట్రాక్టర్లతో చెత్తను తీసుకొచ్చి డంపింగ్ చేస్తున్నారు. దీంతో శ్మశానవాటిక చుట్టు పక్కల నివాసముండే కాలనీల వాసులు దుర్గంధంతో ముక్కులు మూసుకుంటున్నారు. శ్మశానవాటికలో భారీ మొత్తంగా పేరుకుపోయిన చెత్తకుప్పలకు నిప్పు అంటించడంతో చుట్టు పక్కల ప్రాంతాలన్నీ పొగతో కమ్ముకుంటున్నాయి. చెత్తనుంచి వచ్చే మంటలతో పరిసర ప్రాంతాలకు చెందిన గృహ యజమానులు భయంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. వేడిమికి తట్టుకోలేక శ్మశానవాటికకు దూరంగా పోతున్నారు. పొగతో ఊపిరాడని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రోగాలను కొని తెచ్చుకునే పరిస్థితి నెలకొందంటున్నారు. శ్మశానవాటికనుంచి డంపింగ్ యార్డును ఎత్తివేయాలంటూ పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యర్థాలను బహిరంగంగా కాల్చకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ బల్దియా శానిటేషన్ సిబ్బందే దానిని బ్రేక్ చేసి చెత్తను తగులబెట్టడం కొసమెరుపు.

–వరంగల్ వాయిస్, కాశిబుగ్గ



2లో..

## ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ
- వివిధ సమస్యలపై వినతులు స్వీకరణ



8లో..

## జైళ్లు సరిపోవు

- పదేళ్లలో రికార్డు స్థాయి పాపాలు
- చోటా గజదొంగ కేటీఆర్
- స్థాయిని మరచి మాట్లాడితే ఊరుకోం
- హెచ్చరించిన ఎమ్మెల్యేలు నాయిని, కేఆర్



2లో..

## పుష్‌పుల్‌ను వరంగల్ నుంచి నడపండి

నెక్కొండలో శాతవాహన, పద్మావతి, ఇంటర్‌సిటీకి హాల్టింగ్ ఇవ్వాలి

రైల్వే మంత్రికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ వినతి

# ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ
- వివిధ సమస్యలపై వినతులు స్వీకరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం హనుమకొండ రాంనగర్ లోని తమ నివాసంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యలను సావధానంగా వింటూ అప్పటికప్పుడే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తుందన్నారు.

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నూతన పథకాలు ప్రవేశ పెడుతూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఏ ఒక్క పేదవాడికి న్యాయం జరగలేదని దుయ్యబట్టారు. తెచ్చుకున్న తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. నిరుపేదల కన్నీళ్లను తుడిచేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిందని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

### మార్కెట్ సమస్యలు పరిష్కరించాలి..

వరంగల్ కూరగాయల మార్కెట్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కూరగాయల మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షుడు జారతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రి కొండా సుకేఖను కలిసి వినతి పత్రం అందజేశారు. పార్కింగ్, చిల్లర, హోల్ సేల్ వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి వారం రోజుల్లో మార్కెట్ ను సందర్శించి ప్రత్యక్ష్యంగా సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తానంటూ హామీ ఇచ్చినట్లు జారతి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు చింతాకుల అనిల్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ బాబు, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, మార్కెట్ కార్యదర్శి జి.రాజేందర్, సూపర్ వైజర్ మురళీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా.. అపరేష్ కుమార్ సింగ్ ప్రమాణస్వీకారం

తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అపరేష్ కుమార్ సింగ్ శనివారం ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. రాజ్ భవన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తదితరులు పాల్గొన్నారు.

–వరంగల్ వాయిస్, హైదరాబాద్

# పుష్‌పుల్‌ను వరంగల్ నుంచి నడపండి

- నెక్కొండలో శాతవాహన, పద్మావతి, ఇంటర్‌సిటీకి హాల్టింగ్ ఇవ్వాలి
- రైల్వే మంత్రికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ వినతి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిరుపేదలకు ఉపయోగకారిగా ఉన్న పుష్‌పుల్ రైల్‌ను వరంగల్ నుంచి నడపాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ విజ్ఞప్తి చేశారు. అలాగే, నెక్కొండలో శాతవాహన, పద్మావతి, ఇంటర్‌సిటీ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని కోరారు. ఈమేరకు శనివారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ కు వినతిపత్రం అందించారు. కాజీపేటలోని అయోధ్యపురంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులను పరిశీలించేందుకు ఆయన శనివారం నగరానికి రాగా కేంద్రమంత్రిని కలిని స్థానిక సమస్యలపై విన్నవించారు. అనంతరం గంట రవికుమార్ మాట్లాడుతూ ఇంతకుముందు వరంగల్ నుంచి తెల్లవారు జామున పుష్‌పుల్ రైలు నడిచేదని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉదయం కాజీపేట నుంచి హైదరాబాద్‌కు పుష్‌పుల్ నడుస్తోందన్నారు. కేవలం మధ్యాహ్నం వేళ మాత్రమే వరంగల్ నుంచి నడుపుతున్నారని, అలాగే రాత్రి కాజీపేట వరకు నడుస్తోందని వాపోయారు. పుష్‌పుల్‌ను ఉదయం, రాత్రి వరంగల్ వరకు నడిపి పేద ప్రయాణికులకు సహకరించాలని కేంద్రమంత్రిని కోరినట్టు గంట రవికుమార్ పేర్కొన్నారు. అలాగే నెక్కొండ రైల్వే స్టేషన్‌పై దృష్టి సారించాలని గంట రవికుమార్ కోరారు. ఇటీవలి కాలంలో ప్రయాణికుల రద్దీ పెరిగిన నేపథ్యంలో అక్కడ శాతవాహన, పద్మావతి, ఇంటర్‌సిటీ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలన్నారు. దీనికి కేంద్రమంత్రి సానకూలంగా స్పందించినట్టు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా రైల్వే అభివృద్ధికి కేంద్రం ఎంతో కృషి చేస్తోందన్నారు. దీనికి నిదర్శనం మూడో రైల్వే లైన్ పనులు శరవేగంగా నడవడమేనన్నారు.

### బీజేపీ జెండా ఆవిష్కరణ..

వరంగల్ జిల్లా ఐనవోలు మండలం వనమాల కనపర్తి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షులు మాదాసు ప్రణయ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, జాతీయ కౌన్సిల్ మెంబర్ మార్తినేని ధర్మారావు ముఖ్యఅతిథిలుగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బన్న ప్రభాకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు బండి సాంబయ్య యాదవ్, రాష్ట్ర నాయకులు మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, జిల్లా నాయకులు మహేష్ గౌడ్, నరసింహా, పులి సాగర్, మండల ప్రధాన కార్యదర్శి మద్ది రవితేజ, పొన్నాల రాజు, మండల ఉపాధ్యక్షులు నరికే రాజేషు, శక్తి కేంద్ర ఇన్చార్జి రాజేష్ గౌడ్, బూత్ అధ్యక్షులు శ్రీకాంత్, నిఖిల్ రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు కిరణ్, ప్రభాకర్, రాజేష్, అభిషేక్, సతీష్, నగేష్, రాజు, సాగర్, శివ, రాము కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహిళా సాధికారతే లక్ష్యం

- ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేయూత
- అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, గీసుకొండ :** మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం గీసుగొండ మండలం కొనాయమాకుల గ్రామంలోని ప్రగతి మండల మహిళ సమైక్య భవనం చుట్టూ రూ.10 లక్షల ఎంపీ నిధులతో నూతనంగా నిర్మించనున్న ప్రహరీకి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డితో కలిసి కడియం కావ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ మహిళలు అర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చేయూత నిందిస్తుందన్నారు. గత పది సంవత్సరాలు పాలకుల నిర్లక్ష్యానికి గురైన మహిళా లోకానికి ఇందిరమ్మ రాజ్యంలో అభివృద్ధి ఫలాలు అందిస్తున్నామన్నారు. నివాస గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్ని కావ్య వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. గతంలో మహిళలు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే వారని, నేడు విభిన్న రంగాల్లో రాణిస్తూ తమ సత్తా చాటుతున్నారన్నారు. పరకాల నియోజకవర్గంలోని మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రూ.32 కోట్లతో మహిళా భాగస్వామ్యంతో మహిళా డైరీ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధమైందన్నారు. మహిళలు తన సొంత కాళ్లపై నిలబడేలా ప్రోత్సాహాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.



# కమిషనర్ క్షేత్ర స్థాయి పర్యటన

ఎంజీఎంలో నిర్వహిస్తున్న 750 కేఎల్ డీ ఎస్టీపీ నిర్వహణ తీరు, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పురోగతిని శనివారం గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలంటూ సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

–వరంగల్ వాయిస్, వరంగల్

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, జూలై 19, 2025

# సోషలిజం లక్ష్యంగా సమరశీల పోరాటాలు



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణ త్యాగాలు చేసిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, స్వరాజ్యం అనంతరం దేశంలో పేదరికాన్ని నిర్మూలించి, వివక్షతలను తొలగించి సోషలిజం సాధించడమే లక్ష్యంగా పోరాడుతోందని సీపీఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, నేదునూరి రాజమౌళి అన్నారు. శుక్రవారం హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. మెట్టు శ్యాంసుందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ సోషలిజం ధ్యేయంగా, కమ్యూనిజం లక్ష్యంగా, వర్గ, వర్ణ రహిత సమాజ నిర్మాణం కోసం క్రియాశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. వామపక్ష, లౌకిక శక్తుల ఐక్యతకు, పోరాటాలకు, పార్టీ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ఆగస్టు 19 నుండి 22 వరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గాజులరామారంలో జరగనున్న రాష్ట్ర మహాసభలలో సమీక్షించి భవిష్యత్తు పోరాట కార్యక్రమాన్ని ప్రకటిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏదునూరి వెంకటరాజం, భారత్ బచావో వరంగల్ జిల్లా కార్యదర్శి దొమ్మాటి ప్రవీణ్ కుమార్, హసన్‌పర్తి మండల సీపీఐ కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, రేణిగుంట్ల రాజయ్య, ఆర్టీసీ దామోదర్, రేణిగుంట్ల చిరంజీవి, గాజుల ప్రపంచం, నేదునూరి శ్రీనివాస్, కల్వచర్ల వెంకటేశ్వర్లు, భాష బోయిన కుమారస్వామి, ఆర్టీసీ బండెల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# లాఠీలు, తూటాలతో ఉద్యమాన్ని ఆపలేరు

◆ విద్యార్థి సంఘాల ఆందోళన
◆ కాళోజీ జంక్షన్ వద్ద ఉద్రిక్తత




**హనుమకొండ, వరంగల్ వాయిస్:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో శనివారం హనుమకొండలోని కాళోజీ జంక్షన్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు ప్రయత్నించిన విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. ఆగ్రహించిన సంఘ నాయకులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాషబోయిన సంతోష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాచకొండ రంజిత్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ రోహిత్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కన్వీనర్ మాస్ సావిత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా విస్మరించినందువల్లే విద్యార్థులు, నిరుద్యోగులు ఏకమై ప్రభుత్వాన్ని గద్దె దించారని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యారంగ వ్యతిరేక విధానాలనే అవలంబిస్తోందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల మధ్య విద్యారంగ విస్మరణలో ఎలాంటి తేడా లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగంపై దృష్టి సారించాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు రాష్ట్రవ్యాప్తంగా కొత్త రకాల దోపిడీకి పాల్పడుతున్నాయని, దీనిని అరికట్టడంలో విద్యాశాఖ విఫలమైందని విద్యార్థి సంఘాల నాయకులు తీవ్రంగా విమర్శించారు. వేల రూపాయల డొనేషన్లు, లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల ఆశలను ఆసరాగా చేసుకుని దందా నడిపిస్తున్నారని ఆరోపించారు. జీవో నెంబర్ 92 ప్రకారం 'ఒలంపియాడ్, డీజీ, టెక్నో' వంటి పేర్లు పెట్టకూడదనే ప్రభుత్వ నిబంధన ఉన్నప్పటికీ, వాటిని తుంగలో తొక్కి 'స్మార్ట్' పేర్లు పెట్టుకొని అదనంగా ఫీజులు దండుకుంటున్నారని అన్నారు. పాఠ్యపుస్తకాల రూపంలో లక్షల రూపాయలు దండుకుంటున్నారని, కళాశాలల్లోనూ ప్రభుత్వ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఒక పర్మిషన్ పై రకరకాల క్యాంపస్‌లు నడుపుతున్నారని తెలిపారు. ల్యాబ్స్, సరైన మౌలిక సదుపాయాలు, విశాలమైన తరగతి గదులు, అర్హులైన లెక్చరర్లు లేకుండానే పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ అకాడమీల పేరుతో అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23న జరిగే విద్యాసంస్థల బంద్‌ను అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు సహకరించి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఐస్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శి బి. రెడ్డి జశ్వంత్, గణేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, కుక్కల కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జు జ్యోతి, కసరబోయిన రవితేజ, పీడీఎస్‌యూ: హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు డానియల్, నాయకులు సాయి, హర్షత్, పృథ్వీ, నందు, సిద్ధు, అరుణ్. అలాగే, వి. కావ్య, బి. గణేష్, వినయ్, సాయి, ఏఐఎస్‌బీ జిల్లా నాయకులు ఎండి. అయాన్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా పాఠశాలకు ఎంపికైన శాన్వికి సన్మానం



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థిని కోల శాన్వి రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెంటి శ్యామ్ తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో శాన్వి పాల్గొని క్రీడా పాఠశాలకు అర్హత సాధించింది. మారుమూల గ్రామానికి చెందిన బాలిక రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ పాఠశాలకు ఎంపిక కావడం పట్ల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు డి.రాజేందర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శ్యామ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ఎస్. లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీధర్, నస్రీన్ శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు క్రీడలకు మంచి ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. ప్రభుత్వం మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించడం వల్ల వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని ఆయన అన్నారు.

# వెంకటేశ్వర స్వామికి వెండి నామాలు సమర్పణ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మండలంలోని ముదుపుగల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయానికి కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన ఆకుల నారాయణ, అలివేలు దంపతులు శనివారం వెండి నామాలను సమర్పించారు. వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకుని స్వామివారికి వెండి నామాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యాస వెంకట్ రెడ్డి, తిప్పిరిశెట్టి ప్రసాద్, ఆకుల కృష్ణ, గుట్టు పరమేశ్వర్, ఆకుల నవీన్ దంపతులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

◆ వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు జూలై 23న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ పోచమ్మైదాన్ కూడలి వద్ద గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మార్త నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చుక్క ప్రశాంత్, యారా ప్రశాంత్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లదేళ్ల శరత్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఏఐఎస్‌బీ జిల్లా నాయకులు సయ్యద్ ముబీన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని, సంక్షేమ హాస్టళ్లు సమస్యలతో సతమతమవుతున్నాయని అన్నారు. వర్షాకాలంలో వర్షాలు కురిస్తే హాస్టల్, పాఠశాల భవనాలు కూలిపోయే ప్రమాదం ఉందని, శిథిలావస్థకు చేరిన భవనాలను తక్షణమే కూల్చివేసి నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా నాయకులు పోలబోయిన రాజు, పీడీఎస్‌యూ నాయకులు సాయి, ఏఐఎస్‌బీ జిల్లా నాయకులు సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.




జూలై 23న జరిగే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేసి విద్యారంగ సమస్యల పరిష్కారానికి మద్దతు ఇవ్వాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, కవులు, కళాకారులకు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు.




## ఎల్కతుర్తిలో..

**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు బొక్కలపాటి సాల్మన్ రాజ్ పిలుపునిచ్చారు. శనివారం ఎల్కతుర్తి మండలంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతూ ఈ డిమాండ్లను ఆయన వెల్లడించారు. విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి. గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి. మెస్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అజయ్, చరణ్, గణేష్, సాయి కిరణ్, సుస్మిత, సుమలత, అక్షర తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'నో బ్యాగ్ డే' వేడుకలు



**రఘునాథపల్లి, వరంగల్ వాయిస్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో ప్రతి నెల మూడవ శనివారం 'నో బ్యాగ్ డే'గా పాటించాలని తలపెట్టిన నేపథ్యంలో, శుక్రవారం రఘునాథపల్లి మండలం వెల్ది మోడల్ స్కూల్‌లో 'నో బ్యాగ్ డే' సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులందరూ బ్యాగులు, పుస్తకాలు లేకుండా పాఠశాలకు హాజరయ్యారు. ఉదయం ఆయా తరగతుల ఉపాధ్యాయులు పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించగా, మధ్యాహ్నం వ్యాయామ ఉపాధ్యాయులు మారపాక రాజయ్య, సానబోయిన వాసుదేవ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు జరిగాయి. అనంతరం 'నో బ్యాగ్ డే' ఇంచార్జ్ కందగట్ల గణేష్ విద్యార్థులను బ్లూ, గ్రీన్, రెడ్, ఎల్లో గ్రూపులుగా విభజించి క్విజ్ పోటీ నిర్వహించారు. ఇంచార్జి ప్రిన్సిపల్ మల్లం శ్రీధర్, ఉపాధ్యాయులు రుద్రమదేవి, విజయ, కట్ట రాజు, దారం శ్రీను, కోమటి మోహన్ రావు, తుమ్మ రవి, షహనా సుల్తానా, పాలకుర్తి వినీల, శశి కుమారి, మాలతి, లలిత, తొండ రామకృష్ణ స్వామి, రేణుక, బాలరాజు పాల్గొన్నారు.

# సీఎం సోదరుడు తిరుపతి రెడ్డిని కలిసి తౌటం రవీందర్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్న కాంగ్రెస్ నాయకుడు ఎనుముల తిరుపతి రెడ్డిని శనివారం టీపీసీసీ (ఓబీసీ) కోఆర్డినేటర్ తౌటం రవీందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. తన నివాసంలో తిరుపతి రెడ్డిని శాలువాతో సత్కరించి గౌరవించారు.

# మంత్రి కొండా సురేఖకు సన్మానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని అత్యంత పురాతన, ప్రసిద్ధిగాంచిన కాశీబుగ్గలోని కాశీ విశ్వేశ్వర రంగనాయక స్వామి ఆలయాలకు రూ. 2.50 కోట్లు అభివృద్ధి నిధులు మంజూరు చేసిన సందర్భంగా, రంగనాయక స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ దేవాలయంలో చేపట్టే నిర్మాణ పనులన్నీ వాస్తు ప్రకారం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంబి సాంబరాజు, రంగనాథ స్వామి దేవాలయ మాజీ అధ్యక్షులు వంగరి రవి, కమిటీ సభ్యులు గోష్కొండ సుధాకర్, చిలుపూరి సురేష్, సాంబారి ప్రభాకర్, మౌటం శ్రీనివాస్, పిట్టల కోటేశ్వర్, సుల్తానా సమ్మక్క, మంచాల సృజన, దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, గుండేటి రజనీకాంత్, మార్త సందీప్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డుల పంపిణీ



**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండ జిల్లా దామెర మండలంలోని పులుకుర్తి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం గ్రామస్తులలో హర్షం వ్యక్తమైంది. ఈ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఎన్.వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీను, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ బొల్లం వేణుగోపాల్, రేషన్ డీలర్లు జి. జయంతి, సంధ్యారాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కారోబార్ జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. కొత్త రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# బాధిత కుటుంబానికి స్నేహితుల చేయూత



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ బ్యాంకులో సీనియర్ క్లర్క్‌గా పనిచేసిన గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, నాగరాజు చిన్ననాటి స్నేహితులు ఆదుకోవడానికి ముందుకొచ్చారు. దశదిన కర్మ కార్యక్రమంలో స్నేహితులందరూ కలిసి రూ. 16,500 నగదును నాగరాజు కుమార్తె మాన్వికకు అందజేశారు. మిత్రులు బొమ్మకంటి రాజేందర్, కుసుమ మురళి, కక్కెర్ల భరత్, తంగళ్లపెల్లి సంతోష్, పెద్దపెల్లి సురేందర్, తిరుపతి, భూపాల్, రాజ్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంరక్షణ చట్టంపై అవగాహన అవసరం

◆ పరకాల ఆర్డీఓ నారాయణ



**వరంగల్ వాయిస్, పరకాల :** వయోవృద్ధుల వివిధ రకాల అవసరాలు తీర్చేందుకు భారత ప్రభుత్వం తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం 2007ని అమలులోకి తెచ్చిందని, ఈ చట్టం ద్వారా వయోవృద్ధుల ప్రాణానికి, ఆస్తులకు చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం నియమావళి 2011పై అందరూ అవగాహన కలిగి ఉండాలని పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కే. నారాయణ అన్నారు. 'వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు – పరిష్కార మార్గాలు' అంశంపై శనివారం పరకాల ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.పరకాల వయోవృద్ధుల సంక్షేమ సంస్థ అధ్యక్షులు రేపాల నరసింహారాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్డీఓ నారాయణ మాట్లాడుతూ చట్టబద్ధత కలిగిన ఈ నియమావళి ప్రకారం తల్లిదండ్రులు, వయోవృద్ధుల ప్రాణానికి, ఆస్తులకు సంరక్షణ, పోషణతో పాటు భరణం అడిగే హక్కు కల్పించబడుతుందన్నారు. ఈ చట్టం అమలులో భాగంగా ఆర్డీఓ ఆధ్వర్యంలో పరకాల వయోవృద్ధుల సంక్షేమ సంస్థకు చెందిన ముగ్గురు సభ్యులతో ట్రిబ్యునల్ ఏర్పడిందని తెలిపారు. దీని ద్వారా పరకాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన వయోవృద్ధుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించి న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. ఇటీవల వచ్చిన ఫిర్యాదుల నుంచి ఇప్పటివరకు 26 కేసులు పరిష్కరించబడ్డాయని, మరో 24 కేసులు విడతల వారీగా పరిష్కరిస్తున్నామని ఆయన వివరించారు. ప్రతి బుధ, శని వారాల్లో ఫిర్యాదులు స్వీకరించి, వారి పిల్లలకు నోటీసులు పంపి కౌన్సిలింగ్ ద్వారా తీర్పులు ఇస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి అతిథిగా విచ్చేసిన వయోవృద్ధుల సంక్షేమ సంస్థ, విద్యారణ్యపురి, హనుమకొండ అధ్యక్షులు, విశ్రాంత డీఎస్పీ దామెర నర్సయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టాన్ని అందరూ సద్వినియోగపరచుకోవాలన్నారు. పరకాల ఐసీడీఎస్ సీడీపీఓ స్వాతి మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం 2007 గురించి వివిధ గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమ సంస్థ, పరకాల అధ్యక్షులు రేపాల నరసింహారాములు మాట్లాడుతూవయోవృద్ధుల పోషణ, సంరక్షణ సాఫీగా జరగాలంటే వృద్ధులతో పాటు యువతీ, యువకులు, విద్యార్థులకు తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం పట్ల అవగాహన కల్పించేందుకు సంస్థ కృషి చేస్తుందన్నారు. హనుమకొండ సంస్థ ప్రధాన కార్యదర్శి తీరాల యుగంధర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టం 2007 గురించి వివరించారు. పరకాల ఆర్డీఓ ట్రిబ్యునల్ సభ్యులు భూషి ప్రభాకర్ రెడ్డి, కోడిపాక సమ్మయ్య, సుంకర రామన్నలతో పాటు వృద్ధ మిత్ర సభ్యులు ముదురుకోళ్ల సంపత్ వివిధ ఫిర్యాదుల పరిష్కారాల గురించి వివరించారు. హనుమకొండ సంస్థ సభ్యులు నాగులదాం నరసయ్య, మార్క రవీందర్ గౌడ్, లక్ష్మీనారాయణతో పాటు పరకాల సంస్థ సభ్యులు ఎడ్ల సుధాకర్, రాఘవరెడ్డి, గుర్రం సదానందం, నర్సింగరావు, ఎస్. శ్రీనివాసాచారి, బి.మొగిలయ్య, ఏకు సారయ్య, ఐసీడీఎస్ సూపర్వైజర్ రోజా రాణి, ఆర్డీఓ కార్యాలయ అసిస్టెంట్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అందుబాటులో యూరియా

మండల వ్యవసాయాధికారి పోరిక జై సింగ్



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్ తెలిపారు. నార్లాపూర్ గ్రామ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో 20 మెట్రిక్ టన్నులు, మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రెండు మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జై సింగ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మండలంలో 8,500 ఎకరాలలో పత్తి, 1,200 ఎకరాలలో వరి సాగవుతోందని తెలిపారు. రైతులకు కావాల్సిన యూరియాను ఆధార్, పట్టా పాస్‌బుక్ సమర్పించి పొందవచ్చని సూచించారు. పత్తి పంట 30–40 రోజుల శాఖీయ దశలో ఉన్నందున, రైతులు సంప్రదాయ యూరియాకు బదులుగా ద్రవరూపంలో ఉండే నానో యూరియాను పిచికారీ చేసుకోవాలని ఆయన కోరారు. ద్రవ యూరియా ఆకులపై పిచికారీ చేయడం వల్ల మొక్కలు పోషకాలను సమర్థవంతంగా వినియోగించుకుని, తక్కువ యూరియాతోనే పంట దిగుబడి పెరుగుతుందని వివరించారు. నానో యూరియా వాతావరణ కాలుష్యాన్ని నివారిస్తుందని, పంటల్లో నాణ్యత పెరిగి, రవాణా, నిల్వ ఖర్చులు తగ్గి రైతులకు డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. అనంతరం, ఆయిల్ పామ్ సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగు చేయదలిచిన రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జనగం ప్రదీప్, పలువురు రైతులు పాల్గొన్నారు.

# కేటీఆర్ తీరు మార్చుకోకుంటే బుద్ధి చెబుతాం

బండి సుధాకర్ గౌడ్ హెచ్చరిక



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అవమానకర రీతిలో మాట్లాడటాన్ని సహించబోమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. కేటీఆర్ తన భాషను మార్చుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. బండి సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ కేటీఆర్ కుటుంబం తెలంగాణ ప్రజలకు లెక్కలేనన్ని వాగ్దానాలు చేసి, ఏ ఒక్కటీ సరిగా నెరవేర్చలేదని దుయ్యబట్టారు. ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టి, తెలంగాణ వనరులను వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుని ప్రజలను నిండా ముంచారని విమర్శించారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలకు ద్రోహం చేసి, ప్రజల కలలు, ఆశలను వమ్ము చేశారని బండి స్పష్టం చేశారు. పదేళ్లు అధికారాన్ని అనుభవించిన కేటీఆర్ కుటుంబం తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమీ లేదని, వారి అవినీతి వల్లే తెలంగాణ ఖజానా దివాళా తీసిందని ఆరోపించారు. ఇదే సమయంలో, దివాళా తీసిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రమంగా పట్టాలెక్కిస్తూ, ప్రగతి వైపు నడిపిస్తున్నారని బండి సుధాకర్ గౌడ్ ప్రశంసించారు. ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు పూర్తిగా ఛీత్కరించినా కేటీఆర్‌కు బుద్ధి రాలేదని, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని పగటి కలలు కంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని బండి సుధాకర్ ఎద్దేవా చేశారు. బీ కేటీఆర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడటాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని సుధాకర్ గౌడ్ హెచ్చరించారు. ఇప్పటికైనా కేటీఆర్ తాను చేసిన తప్పుడు వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పాలని, లేదంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని బండి సుధాకర్ గౌడ్ హెచ్చరించారు.

# సదరం సర్టిఫికెట్ కోసం స్లాట్ బుకింగ్

**వరంగల్ వాయిస్, జనగామ :** వికలాంగులు సదరం సర్టిఫికెట్ కొరకు మీసేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎన్ వసంత తెలిపారు. ఈనెల 22న దృష్టిలోపం, గుడ్డి, తల సేమియా వికలాంగులు, అలాగే 23న లెప్రసీ, 25న వినికిడి, మూగ, 29న లెప్రసీ 31న మెంటల్ ఇల్ నెస్, ఇంటలెక్చ్యువల్ లకు గాను కొత్తవి 140 స్లాట్లు ఉండగా రెన్యువల్ 90 స్లాట్ ఉన్నాయని మొత్తంగా 230 ఉన్నాయన్నారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో UDID వెబ్ సైట్ లో కొత్తగా బుక్ చేసిన వారికి ఫోన్లో మెసేజ్ వచ్చిన తేదీలలోనూ రెన్యువల్ వారు మీ సేవ కేంద్రాలలో స్లాట్ బుకింగ్ చేసుకుని రసీదులో ఉన్న ఫోన్ కు మెసేజ్ వచ్చిన తేదీలలో ఆసుపత్రిలో హాజరు కావాల ని కోరారు. మెసేజ్ వచ్చినవారు డాక్టర్ రిపోర్టులతో ఆధార్ కార్డు ఫొటో మీ సేవ రశీదులతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రావాలని ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# రైతులకు యూరియా అందించలేని చేతగాని ప్రభుత్వం

◆ స్థానిక సంస్థలలో గులాబీ జెండా ఎగరేద్దాం
◆ పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** రైతులకు కనీసం యూరియా కూడా అందించలేని "చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం" అని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఆత్మకూరు మండలం అగ్రంపాడ్ గ్రామ శివారులోని జీఆర్ఎస్ గార్డెన్స్‌లో ఆత్మకూరు, దామెర మండలాల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. లేతాకుల సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చల్లా ధర్మారెడ్డి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే ఆ పార్టీకి గుణపాఠం చెబుతారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలుచుకొని సత్తా చాటాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని కోరారు. పార్టీ మారకుంటే అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడిన చల్లా, "మీ అక్రమ కేసులకు, బెదిరింపులకు భయపడే వారు ఎవరూ లేరు" అని హెచ్చరించారు. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని ఇంటింటా వివరించాలని, ఇరవై నెలల కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్షసాధింపు రాజకీయాలు మానుకొని పరిపాలన మీద దృష్టి సారించాలని చల్లా సూచించారు. కేసీఆర్ నాయకత్వంలో పదేళ్లు రాజకీయాలకు అతీతంగా పరిపాలన కొనసాగించారని గుర్తుచేశారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలల్లో పథకాల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. 50 సార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి ఏం సాధించారో, ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని సవాల్ విసిరారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన గృహలక్ష్మి, డబుల్ బెడ్‌రూమ్ బిల్లులు చెల్లించేలా కోర్టు మెట్లక్కానని, వారందరికీ బిల్లులు ఇప్పించే బాధ్యత తనదేనని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట మట్టి దోపిడీకి పాల్పడుతున్నారని, కింది స్థాయి కార్యకర్త నుండి బడా నాయకుల వరకు కమిషన్లు తీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. "దేశానికే తలమానికంగా నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారాలు చేసి వ్యవసాయానికి సాగునీరు అందించలేదు. రైతు బీమాకు రాం..రాం.. రైతుబంధు ఎగ్గొట్టారు. కల్యాణలక్ష్మిలో తులం బంగారం ఇవ్వలేదు. వరికి పంటకు బోనస్ బోగసే. మహాలక్ష్మి పథకానికి మంగళం పాడారు. విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వలేదు" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై చల్లా ధర్మారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. "మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. అప్పటివరకు కార్యకర్తలు సమన్వయంతో ఉండాలి. మీకు అండగా, మీ కష్టసుఖాల్లో నేను ఉంటాను" అని ఆయన కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, దామెర మండలాల అధ్యక్షులు సంజీవరెడ్డి, గుండు రాము, వైస్ ఎంపీపీలు జాకిర్ అలీ, రేవూరి సుధాకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మనస్థాపంతో పురుగుల మందు తాగి యువకుడి మృతి

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలో భూవివాదం ఓ యువకుడి ప్రాణాలు తీసింది. నాల్లం మల్లయ్య అనే వ్యక్తి కుటుంబానికి, జనగాం సమ్మయ్య కుటుంబానికి మధ్య నెలకొన్న ఈ వివాదంలో, మనస్థాపానికి గురైన నాల్లం మల్లయ్య మనవడు నాల్లం మూర్తి (24) పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాల్లం మల్లయ్య 25 సంవత్సరాల క్రితం జనగాం మల్లయ్య అనే వ్యక్తి వద్ద 4 గుంటల భూమిని కొనుగోలు చేశారు. ఆ తర్వాత, ఒక గుంట స్థలాన్ని జనగాం మల్లయ్య కుమారుడు జనగాం సమ్మయ్య వద్ద కొనుగోలు చేశారు. అయితే ప్రస్తుతం, జనగాం సమ్మయ్య తమకు 4 గుంటలు మాత్రమే అమ్మినట్లు, మిగతా ఒక గుంట తమదేనని వాదిస్తూ గొడవకు దిగుతున్నాడు. ఈ క్రమంలో జూలై 13న జనగాం సమ్మయ్య, అతని కుమారుడు రాజాగౌడ్ భూమి వద్దకు వచ్చి నానా దూషణలకు దిగారు. పెద్దమనుషులు బాదావత్ మంగ్యా, మడ్డి రాములు సమక్షంలో గేట్లు కూడా నాటించారు. ఈ ఘటనతో తీవ్ర మనస్థాపానికి గురైన నాల్లం మూర్తి పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై జూలై 15న పర్వతగిరి పోలీస్ స్టేషన్‌లో జనగాం సమ్మయ్య, రాజాగౌడ్, బాదావత్ మంగ్య, మడ్డి రాములు అనే నలుగురిపై కేసు నమోదు చేయబడింది. చికిత్స పొందుతూనే నాల్లం మూర్తి నేడు మెడికవర్ ఆసుపత్రిలో మరణించినట్లు పర్వతగిరి ఎస్ఐ తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్‌పూర్ :** మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశాని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి పార్టీని వెన్నుపోటు పొడిచాడు. ఇప్పుడు ప్రజలు అతనికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కడియం శ్రీహరి ఎన్నికల్లో గెలవలేడని తెలిసే భూములు కబ్జా చేయడంలో నిమగ్నమయ్యాడని ఆరోపించారు. "దేవునూరులో 20 ఎకరాల భూమిని, శివునిపల్లిలో భూమిని, ధర్మసాగర్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తూ, తన వద్ద భూమి లేదని అబద్ధం చెబుతున్నాడు" అని రాజయ్య విమర్శించారు. అంతేకాకుండా, "స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లకు లక్ష, రేషన్ కార్డుకు 2 వేల నుండి 3 వేల వరకు వసూలు చేస్తున్నారు" అని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకే ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగిరేలా ప్రతి కార్యకర్త ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్టేషన్ ఘన్‌పూర్ మండలానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# ప్రజా ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు మేలు

● కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో నాయిని



**వరంగల్ వాయిస్, కాజీపేట :** ప్రజా ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం కాజీపేట మండలానికి చెందిన 42 మంది లబ్ధిదారులకు రూ. 42,04,842 విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తుందని తెలిపారు. కల్యాణ లక్ష్మి పథకం ద్వారా లబ్ధిదారులు ఎటువంటి దళారులను నమ్మవద్దని సూచించారు. వివాహం చేసుకున్న ఇంటికి ఆర్థిక సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్, మామిండ్ల రాజు, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ వేద స్కూల్‌లో బోనాల సంబరాలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పెద్దకొడపాక గ్రామంలో ఉన్న శ్రీ వేద పాఠశాలలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం విజయ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం విజయ్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఆషాడ మాసంలో గ్రామ గ్రామాన బోనాల పండుగను జరుపుకుంటారని, ఈ సంస్కృతి, సంప్రదాయాలు విద్యార్థులకు తెలియాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రియాంక, కీర్తి రెడ్డి, సౌందర్యతో పాటు వేద విద్యార్థులు పాల్గొన్నారు.

# 'యాంటీ డ్రగ్స్' పై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం'యాంటీ డ్రగ్స్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి. కవిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మానసిక ఆరోగ్య నిపుణులు డాక్టర్ ప్రహసిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రహసిత్ విద్యార్థులకు ముఖ్యమైన సూచనలు చేస్తూ, "డ్రగ్స్, మాదకద్రవ్యాలు, చెడు స్నేహితులు, చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలి" అని తెలిపారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక స్థిరమైన లక్ష్యాన్ని నిర్ణయించుకొని, దాన్ని సాధించేందుకు క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. "అవాంతరాలు వస్తే వాటికి భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొని ముందుకు వెళ్లాలి. లక్ష్యాన్ని చేరుకునే వరకు కృషి అవసరం" అని అన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెడితే వారి భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందని డాక్టర్ ప్రహసిత్ స్పష్టం చేశారు. అనంతరం డ్రగ్స్ ముప్పును వివరించే ఓ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ కందకట్ల సంపత్, సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టెక్నో సెన్స్ హైస్కూల్‌లో మెహందీ ఫెస్టివల్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని రెడ్డీపురంలో గల టెక్నో సెన్స్ హై స్కూల్‌లో శనివారం మెహందీ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ రాజమల్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రకరకాల మెహందీ డిజైన్‌లతో ఒకరికొకరు అలంకరించుకుంటూ ఆద్యంతం అందరినీ అల్లరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజమల్లు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలు, ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటే ఒత్తిడికి గురికాకుండా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు స్వాగతం పలికిన విజయచందర్ రెడ్డి



**పరకాల, వరంగల్ వాయిస్:** కాజీపేటలో నిర్మాణంలో ఉన్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు హనుమకొండ జిల్లాకు విచ్చేసిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టితో తెలంగాణకు ప్రాధాన్యతనిస్తూ స్థాపితమవుతున్న ఈ ప్రాజెక్టు గర్వకారణమని అన్నారు. రూ. 750 కోట్లతో నిర్మిస్తున్న ఈ కోచ్ ఫ్యాక్టరీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. దేశంలో రైలు మౌలిక వసతుల అభివృద్ధిలో ఇది ఒక చారిత్రాత్మక అడుగు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అశ్విని వైష్ణవ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# వ్యాయామం ఆరోగ్యానికి రక్ష

## శాయంపేట ఎస్సై పరమేష్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** ప్రతిరోజూ వ్యాయామం చేయడం వల్ల మనిషి శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతాడని శాయంపేట ఎస్సై పరమేష్ అన్నారు. మారిన జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకునేందుకు వ్యాయామం ఎంతగానో తోడ్పడుతుందని ఆయన తెలిపారు. వ్యాయామం చేయడం వల్ల తమ రోజువారీ పనులలో చురుకుగా ఉండవచ్చని, ఉదయం పూట నడకతో కొన్ని రోగాలకు చెక్ పెట్టవచ్చని ఎస్సై పేర్కొన్నారు. వ్యాయామం చేయకపోవడం వల్ల చాలామంది రోగాల బారిన పడుతున్నారని, కాబట్టి ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో భాగంగా వ్యాయామాన్ని అలవాటు చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. వ్యాయామంతో పాటు యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని, ప్రతిరోజూ 30 నిమిషాల నడకతో గుండె సంబంధిత సమస్యలను నివారించవచ్చని ఆయన తెలిపారు. ప్రధానంగా నేటి యువత వ్యాయామం, ఆటలను అలవాటు చేసుకోవాలని ఎస్సై పరమేష్ పిలుపునిచ్చారు.

# ఏకశిలా ప్రైమ్ పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఏకశిలా ప్రైమ్ పాఠశాలలో ముందస్తుగా బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి, ప్రిన్సిపాల్ గోకుల్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ దీపా, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బోనాల పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తూ బేతి కొండల్ రెడ్డి ప్రసంగించారు. ఈ వేడుకల నిర్వహణను చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి అభినందించారు. ముఖ్యంగా, విద్యార్థులు అమ్మవారు, పోతురాజు వేషధారణలో అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.



# నూతన రేషన్ కార్డులతో నిరుపేదలకు లబ్ధి

## ◆ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, గణపురం :** గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా అన్యాయానికి గురైన అనేక మంది అర్హులందరికీ రేవంత్ రెడ్డి సర్కారు కొత్త రేషన్ కార్డులు ఇచ్చి లబ్ధి చేకూర్చిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో తహసీల్దార్ ఎం.సత్యనారాయణ స్వామి అధ్యక్షతన జరిగిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ రావు మాట్లాడుతూ 326 మంది కొత్త లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను, 457 కుటుంబాల పాత రేషన్ కార్డుల్లో చేర్చిన కొత్త కుటుంబ సభ్యులకు సంబంధించిన కార్డులను పంపిణీ చేశారు. ఇప్పుడు కార్డులు పొందిన వారంతా రేషన్ షాపుల్లో ఉచితంగా సన్నబియ్యం పొందాలని కోరారు. రేవంత్ రెడ్డి సర్కారు పేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తుందని, అలాగే మహిళల అభివృద్ధికి ఎన్నో ఆర్థిక కార్యక్రమాలు చేపట్టి మేలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, డీఎస్ఓ కిరణ్, కాంగ్రెస్ నాయకులు ఆర్. రాజేందర్, ఎం.రాజయ్య, ఎం.శివ శంకర్, డి.శంకర్, వి.నారాయణ, చోటే మియా, కే.శ్రీను, కే.రామ్ రెడ్డి, వి.సుందర్, డి.దుర్గయ్య, వై. రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### శాయంపేటలో..

**వరంగల్ వాయిస్, శాయంపేట :** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులందరికీ నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తుందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆర్డీవోతో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణరావు, వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, మాజీ జెడ్పీటీసీ చల్ల చక్రపాణి, మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, అధికార ప్రతినిధి చిందం రవిపాల్గొన్నారు.

# రాయపర్తి జడ్పీ హైస్కూల్‌లో బోనాల సంబరాలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని రాయపర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలంగాణ రాష్ట్ర పండుగలలో కీలకమైన బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు ఈ ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో విద్యార్థులు పోతరాజు విన్యాసాలతో అందరినీ అలరించారు. గ్రామ పెద్దలు, ప్రజలు, మహిళలు ఈ ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. ఉపాధ్యాయుడు సునీల్ కుమార్ పండుగ విశిష్టతను, ప్రాధాన్యతను పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి పిల్లలకు మన రాష్ట్ర సాంస్కృతిక విలువలను తెలియజేస్తున్నారని అభినందించారు.

# షైన్ స్కూల్‌లో ఘనంగా బోనాల సంబరాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాంనగర్‌లోని షైన్ ఉన్నత పాఠశాల ఎలైట్ క్యాంపస్‌లో బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు బోనాల పండుగ విశిష్టతను వివరిస్తూ కార్యక్రమాన్ని రంగులమయం చేశారు. ఈ వేడుకలకు షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల ముత్యాల (బంగారం) వేషధారణలను, పోతురాజుల విన్యాసాలను ఆయన తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల డైరెక్టర్ మూగల రమ, ప్రిన్సిపాల్ ప్రగతి రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బోనాలకు ఉన్న విశిష్టతను తెలుసుకుంటూ, విద్యార్థులకు కూడా దాని ప్రాముఖ్యతను వివరించారు.

# రాజన్ బాబును పరామర్శించిన ప్రసన్న



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలోని 40వ డివిజన్, ఉర్సు బొడ్రాయి ప్రాంతానికి చెందిన కన్నతల్లి ఫౌండేషన్, కన్నతల్లి వృద్ధాశ్రమం చైర్మన్, మ్యాస్ తెలంగాణ వరంగల్ జిల్లా ఇన్‌చార్జి కొండమీది రాజన్ బాబు తల్లి కొండమీది అనంతమ్మ గురువారం మరణించారు. ఈ వార్త తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర హెల్త్ అండ్ మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్ యూనియన్ అధ్యక్షురాలు ఎస్.కే.ప్రసన్న శనివారం వారి నివాసానికి చేరుకొని రాజన్ బాబు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ రాష్ట్ర సంఘం నాయకులు బంగారు అరుణ, రోహిణి దేవి, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం మహిళా అధ్యక్షురాలు అనురాధ గౌడ్, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నూకల అంజి యాదవ్, లీడర్ బొల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగో తరగతి ఉద్యోగులకు వేతనాలు పెంచాలి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** జాతీయ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులకు వెంటనే వేతన సవరణ చేయాలని, కనీస వేతనం జీవో 60 ప్రకారం రూ. 15,600 తక్షణమే చెల్లించాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లలో పనిచేస్తున్న ఎం.ఓ. అసిస్టెంట్, వాచ్‌మెన్, స్వీపర్, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కాంటింజెన్సీ వర్కర్, ఎస్.ఎన్.సి.యు. సపోర్టింగ్ స్టాఫ్, సెక్యూరిటీ గార్డ్, మాతా శిశు సంరక్షణ కేంద్రాలలో సెక్యూరిటీ గార్డ్స్‌తో సహా నాల్గో తరగతి ఉద్యోగుల వేతనాలు పెంచాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు.

# తెలంగాణ క్రీడా సంబరాలు



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో శనివారం సోషల్ వాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "తెలంగాణ క్రీడా సంబరాలు" పేరుతో క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. మంగళంపల్లి రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాలీబాల్, త్రోబాల్ పోటీలను నిర్వహించారు. జనగామ ప్రజా వైద్యులు డాక్టర్ రాజమౌళి, డాక్టర్ ప్రీతి దయాల్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. ఈ పోటీల్లో 8 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్ విభాగంలో సెయింట్ మేరీస్ హై స్కూల్, త్రోబాల్ విభాగంలో స్కాలర్స్ హై స్కూల్ విజేతలుగా నిలిచాయి. కేయూ జేఏసీ నాయకులు సుభాష్, ఓయూ జేఏసీ నాయకులు కరుణాకర్, బీఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్, నల్ల రాహుల్, సోషల్ వాయిస్ ఫౌండేషన్ సభ్యులు తుంగ కౌశిక్, బిట్ల చిన్న, మునిగే సురేష్, నరసింహ, భాస్కర్, శరత్, ప్రవీణ్ రెడ్డి, సాయి పాల్గొన్నారు.

# షారూఖ్ ఖాన్‌కు గాయం.. అమెరికా పయనం



బాలీవుడ్ స్టార్ హీరో షారుక్‌ఖాన్ గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి. ఆయన హీరోగా తెరకెక్కుతోన్న 'కింగ్' షూటింగ్‌లో ప్రమాదం జరిగినట్లు– తెలుస్తోంది. గాయానికి సంబంధించి పూర్తి వివరాలు ఇంకా బయటకు రాలేదు. అయితే, అత్యవసర చికిత్స నిమిత్తం షారుక్ అతని బృందం అమెరికా వెళ్లినట్లు– ఆంగ్ల మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఓ యాక్షన్ సన్నివేశంలో డూప్ లేకుండా స్టంట్ చేస్తుండగా ఆయనకు గాయాలైనట్లు కథనాలు పేర్కొన్నాయి. అది తీవ్రమైన గాయం కాదని, కండరాల గాయం అని వర్గాలు తెలిపాయి. దీంతో ప్రస్తుతం జరుగుతోన్న 'కింగ్' షూటింగ్‌ను సెప్టెంబర్‌కు వాయిదా వేసినట్లు– కూడా వార్తలు వైరల్ అవుతున్నాయి. షారుక్ ఖాన్ ఆయన కుమార్తె సుహానా ఖాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కింగ్'. యాక్షన్ కథా నేపథ్యంలో ఈ చిత్రాన్ని సిద్దార్ ఆనంద్ రూపొందిస్తున్నారు. ఇందులో సుహానాకు తల్లి పాత్రలో రాణీ ముఖర్జీ కనిపించనున్నట్లు– సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు– చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# అన్నదమ్ముల అనుబంధం



## అన్నంటే మా అన్నే.. ఆనంద్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తోన్న సినిమా 'కింగ్డమ్' .ఇటీవల ఈ చిత్రం నుంచి 'అన్నా అంటేనే..' పాట విడుదలైన విషయం తెలిసిందే. అన్నదమ్ముల అనుబంధాన్ని చూపేలా ఉన్న ఆ పాట విని తాను భావోద్వేగానికి గురైనట్లు– విజయ్‌దేవరకొండ తమ్ముడు ఆనంద్ దేవరకొండ పోస్ట్ పెట్టారు. వారిద్దరి చిన్నప్పటి ఫొటోలతో చేసిన వీడియోను పంచుకున్నారు. ఈ పాట విని ఎమోషనల్ అయ్యాను. నాకెప్పుడు కష్టం వచ్చినా విజయ్ నాకోసం ముందుంటాడు. నా కలలను తనవిగా భావిస్తాడు. మన తోబుట్టు–వులు బయటకు కనిపించకుండానే మనపై ఎంత ప్రేమ చూపిస్తారో నాకు మా అన్నను చూసే అర్థమైంది. మన నుంచి ఏమీ ఆశించకుండానే ఎంతో ప్రేమ చూపిస్తారు. బహుశా ఈ పాట మా ఇద్దరి కోసమే రాసి ఉంటారు. అన్న అంటే నీలా ఉండాలని అంటూ విజయ్ దేవరకొండను ట్యాగ్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. తాజాగా 'కింగ్డమ్' నిర్మాత నాగవంశీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ విజయ్ దేవరకొండపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విజయ్ 'అర్జున్ రెడ్డి'లో ఒకలా కనిపించారు. 'గీత గోవిందం'లో మరోలా కనిపించారు. ఈ రెండు సినిమాల తర్వాత అతడు తన నటనకు తగిన సినిమాలు చేయలేదని అలాంటి కథలు రాలేదని ప్రేక్షకుల్లో కంప్లయింట్ ఉంది. 'కింగ్డమ్'తో అది పోతుంది. విజయ్‌కు ఈ సినిమా సరిగ్గా సరిపోతుందని అన్నారు.

# 21న శిల్పకళావేదికలో హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ వేడుకలు



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు పార్ట్ 1జూలై 24న థియేటర్లలో విడుదలకు సిద్ధం అయ్యింది. పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో జ్యోతి క్రిష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ప్రతిష్టాత్మక చిత్రం ఈ సినిమా విడుదలకు ఎట్టకేలకు సమయం దగ్గరపడిరది. ఈ భారీ పాన్ ఇండియా చిత్రాన్ని జూలై 24న తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నారు చిత్ర బృందం.ఇక సినిమాపై ఉన్న హైప్ నేపథ్యంలో.. నిర్మాత ఏఎం రత్నం ఒక పెద్ద సర్ప్రైజ్ ప్రకటించారు. జూలై 23 రాత్రి 9:30 గంటలకు దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రీమియర్ షోలు నిర్వహించేందుకు ఏర్పాట్లు– చేస్తున్నట్లు– తెలిపారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల అనుమతులు, అలాగే టికెట్ ధరల పెంపు కోసం కూడా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడిరచారు. సినిమా విడుదలకు ముందు జూలై 21న హైదరాబాద్ లోని శిల్పకళా వేదికలో ప్రీరిలీజ్ ఈవెంట్ ఘనంగా జరగనుందని తెలిపారు. అంతేకాకుండా ఈ వేడుకకు ఎస్ఎస్ రాజమౌళి, త్రివిక్రమ్ శ్రీనివాస్, కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రే, అలాగే మరికొందరు ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. అభిమానులు, పరిశ్రమలో అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఈవెంట్ సినిమాపై హైప్‌ను మరింత పెంచనుందని ఆయన అన్నారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్‌తో పాటు– నిధి అగర్వాల్, బాబీ డోయల్, సత్యరాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, వెన్నెల కిషోర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏ. దయాకర్ రావు నిర్మించిన ఈ చిత్రానికి సంగీతాన్ని ఎమ్.ఎమ్. కీరవాణి అందించారు. ఈ సినిమాతో పవన్ కళ్యాణ్ మళ్లీ తెరపై దర్శనమివ్వబోతుండటంతో అభిమానుల్లో ఉత్సాహం తారాస్థాయికి చేరింది. ప్రీమియర్ షోలు, స్టార్ ఈవెంట్లు– లాంటి కార్యక్రమాలు అన్ని కలసి హరిహర వీరమల్లు సినిమా కోసం ప్రేక్షకుల్లో అంచనాలను పెంచేస్తున్నాయి.

# రామాయణంలో పనిచేయడం గర్వంగా ఉంది

## హన్స్ జిమ్మర్‌తో కలసి సంగీతం అందిస్తున్న రహమాన్

నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రామాయణ' భారీస్థాయిలో తెరకెక్కుతోంది. ఇక 'రామాయణ' రెండు భాగాలుగా విడుదల కానుంది. మొదటి భాగం2026 దీపావళికి, రెండవ భాగం 2027లో విడుదల కానుంది. ఇప్పటికే ఈ చిత్ర ప్రధాన తారాగణం ఖరారైంది. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. రూ.4000 కోట్లతో ఇది తెరకెక్కుతోంది. ఈ సినిమాకు హాలీవుడ్ మ్యూజిక్ దర్శకుడు హన్స్ జిమ్మర్‌తో కలిసి ఏఆర్ రెహమాన్ స్వరాలు అందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మ్యూజిక్‌పై ఏఆర్ రెహమాన్ ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడారు. ఇంత పెద్ద ప్రాజెక్ట్‌కు ఇలాంటి గొప్ప సంగీత దర్శకుడితో కలిసి పనిచేస్తానని నేనే కాదు.. ఎవరూ ఊహించి ఉండరని అన్నారు. రామాయణ' మన భారతీయ సంస్కృతి. ఇలాంటి ప్రాజెక్ట్‌లో అవకాశం రావడం నాకు గర్వంగా ఉంది. అంతా అనుకున్నట్లుగా జరిగి మీ ముందుకు దీన్ని తీసుకురావాలని కోరుకుంటున్నాను. నేను, హన్స్ జిమ్మర్ దీనికోసం ఎన్నో సెషన్‌లు వర్క్ చేశాం. మొదటిది లండన్‌లో, రెండోది లాస్ ఏంజెలెస్‌లో, మూడో సెషన్ దుబాయ్‌లో చేశాం. హన్స్ అన్ని విషయాల్లో నాలానే ఆలోచిస్తారు. మన సంస్కృతిపై ఎంతో గౌరవం ఉంది. తనకు ఏమైనా అర్థం కాకపోతే 'దీన్ని వెస్టర్న్ స్టైల్‌లో కంపోజ్ చేయచ్చా' అని అడుగుతారు. రామాయణ సినిమా అందరూ ఆశ్చర్యపోయేవిధంగా రానుంది. కచ్చితంగా చరిత్ర సృష్టిస్తుందని రహమాన్ అన్నారు.హన్స్ జిమ్మర్ ఎన్నో హాలీవుడ్ సినిమాలకు సంగీతం అందించారు. 'డ్యూన్', 'ఇంటర్ స్టెల్లార్' వంటి చిత్రాలకు మ్యూజిక్ డైరెక్టర్‌గా తన ప్రతిభతో ఆకట్టుకున్నారు. రెండుసార్లు ఆస్కార్ అవార్డులను, ఐదుసార్లు గ్రామీ అవార్డులను సొంతం చేసుకున్నారు. ఇప్పుడు 'రామాయణ'కు మన లెజెండరీ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఆయనతో పాటు వర్క్ చేస్తున్నారు.





# నటుడు ఫిష్ వెంకట్ కన్నుమూత



టాలీవుడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ టాలీవుడ్ నటుడు, కమెడియన్ ఫిష్ వెంకట్ (53) కన్నుమూశారు. కొద్ది రోజుల క్రితమే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన ఆయన కోలుకోలేక తుదిశ్వాస విడిచారు. కిడ్నీ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరారు. ఆయన మరణవార్త విన్న సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియాలో సంతాపం వ్యక్తం చేస్తున్నారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఫిష్ వెంకట్ చికిత్సకు ఆర్థికసాయం అందించారు. తెలుగులో పలు చిత్రాల్లో ఫిష్ వెంకట్ నటించారు. తెలుగు సినిమాల్లో విలన్ అంటే కొందరు గుర్తొస్తారు.. అలాంటి వారిలో ఫిష్ వెంకట్ ఒకరు. మెయిన్ విలన్ పక్కన ఉండే పాత్రలో బోలెడన్ని మూవీస్ చేశారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, జూలై 19, 2025



# జైళ్లు సరిపోవు

- పదేళ్లలో రికార్డు స్థాయి పాపాలు
- చోటా గజదొంగ కేటీఆర్
- స్థాయిని మరచి మాట్లాడితే ఊరుకోం
- హెచ్చరించిన ఎమ్మెల్యేలు నాయిని, కేఆర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధికారంలో ఉన్న పదేళ్లలో చేసిన పాపాలకు శిక్షలు అమలు చేస్తే రాష్ట్రంలో ఉన్న జైళ్లు సరిపోవని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు ఎద్దేవా చేశారు. చోటా గజదొంగ కేటీఆర్ అంటూ ప్రకటించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు కేటీఆర్ పై నిప్పులు చెరిగారు. స్థాయిని మరచి మాట్లాడితే ఊరుకునేది లేదంటూ హెచ్చరించారు. ఒక లుచ్చా, లఫంగ, బట్టెబాజు మాటలు మరోసారి మాట్లాడితే కేటీఆర్ నాలిక చీరేస్తానంటూ ఫైర్ అయ్యారు. గూగుల్లో కచరా అని సెర్చ్ చేస్తే కేటీఆర్ పేరే వస్తుందన్నారు. కేటీఆర్ అంత కచరా రాజకీయ నాయకుడు రాష్ట్రంలో ఎవరూ లేరని దుయ్యబట్టారు. చట్టాన్ని నమ్మి వచ్చిన వారిమి కాబట్టే మీ పాపాలకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేచి చూస్తున్నామన్నారు. మీ తప్పులకు జైలుకు పోయే రోజులు దగ్గర పడుతున్న క్రమంలో ప్రజల అటెన్షన్ ను డైవర్ట్ చేసే పాలిటిక్స్ చేస్తున్నారంటూ మండిపడ్డారు. మీరు చేసిన పాపాలకు, దౌర్జన్యాలకు, దోచుకున్న డబ్బులకు పూర్తి ఆధారాలు ఉన్నాయన్నారు. మీ హయాంలో నిర్మించి కాళేశ్వరంలో పనిచేసిన ఇరిగేషన్ అధికారుల ఇండ్లలో సోదాలు చేస్తే వందల కోట్ల విలువైన ఆస్తులు బయటకు వచ్చాయన్నారు. మీ పాలనలో కనీసం నిరసన తెలిపే స్వేచ్ఛ కూడా లేకుండా చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నీ అయ్యా వరంగల్ మూడు రోజులు ఉండి చేసిన ప్రగల్భాలు, ప్రజలకు ఇచ్చిన హామీలు ఇంకా గుర్తున్నాయన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్, ఉచిత బస్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇల్లు కేటీఆర్ కు కనిపిస్తలేవా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను కళ్లుండి చూడలేని కబోది కేటిఆర్ అంటూ దుయ్యబట్టారు. ముఖ్యమంత్రిపై నువ్వు మాట్లాడే భాష అద్వాన్నంగా ఉందన్నారు. నీకంటే మాకు ఎక్కువ వస్తాయంటూ హెచ్చరించారు. మేము భాష మాట్లాడితే మీరు ఇక్కడ ఉండరన్నారు. మీ అనైతిక నిర్ణయంతో వరంగల్ జిల్లాను ముక్కలు, ముక్కలు చేశారని మండిపడ్డారు. ఈ రోజు జిల్లాలోని మేధావులు వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపాలంటూ ఉద్యమిస్తున్నారన్నారు. బంగారు తెలంగాణ పేరుతో పదేళ్లు దోచుకుతిన్నారన్నారు. అణగారిని వర్గాల అభివృద్ధి, అభ్యున్నతికి పాటుపడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్.నాగరాజు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## రోబోటిక్స్ తరగతులు ప్రారంభం

**వరంగల్ వాయిస్, శివనగర్ :** శివనగర్ లోని వందన డీజీ హై స్కూల్ లో శనివారం నుంచి బోట్ లైవ్ సొల్యూషన్స్ తో కలిసి ఏఐ, రోబోటిక్స్ తరగతులు ప్రారంభించినట్లు పాఠశాల కరస్పాండెంట్ శ్యాం తెలిపారు. విద్యార్థులకు భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ఇది ఒక గొప్ప అవకాశంగా నిలవనుందన్నారు. విద్యార్థుల్లో ప్రత్యేక ఆకర్షణ కల్పించేందుకు లైవ్ బోట్ డిమానుస్ట్రేషన్స్, ఏఐ ఆధారిత తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అన్ని వయసుల పిల్లల కోసం ఆకర్షణీయమైన కార్యక్రమాలు రూపొందించినట్లు తెలిపారు. ప్రతి వారాంతంలో ప్రాక్టికల్ క్లాసులు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సామర్థ్య లక్షణాలు పెంపొందుతాయన్నారు. 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందుబాటులో ఉందన్నారు. మీ పిల్లల భవిష్యత్తుకు శిల్పాలను మేమే తయారు చేస్తున్నా మంతూ కరస్పాండెట్ ప్రకటించారు.



# స్థానికులకే ఉద్యోగాలివ్వాలి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కర్ర హరీష్ రెడ్డి
- కేంద్రమంత్రుల పర్యటనలో ఆందోళన

**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట అయోధ్యపురంలో ఏర్పాటు చేస్తున్న రైల్వే ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో 50 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కర్ర హరీష్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌తోపాటు మరో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాజీపేటలో పర్యటించి, కోచ్ ఫ్యాక్టరీతోపాటు ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కర్ర హరీష్ రెడ్డితోపాటు 45వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సట్ల సదానందం, అయోధ్యపురం గ్రామ పార్టీ అధ్యక్షుడు విరాట్ శ్రీను, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు బస్కె ప్రణయ్, యూత్ కాంగ్రెస్ కాజీపేట మండల అధ్యక్షుడు భోగి కృష్ణ, యువ నాయకులు, స్థానికులు అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాట్లాడుతూ.. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి స్థానికులే అత్యంత విలువైన భూములు ఇచ్చారని, ఇందులో 50శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా, ఇప్పటి వరకు పలువురు భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించలేదని ఆరోపించారు. వెంటనే వారికి పరిహారం ఇవ్వాలని కోరారు. వెంటనే కాజీపేట డివిజన్ ఏర్పాటు చేయాలని, అన్ని అర్హతలున్నా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపడం మానుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు.

# మెట్రో రైళ్ల తయారీకి అనువైన ప్రాంతం

- రూ.521 కోట్లతో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్
- 2026 చివరి నాటికి ప్రాజెక్ట్ మొత్తం పూర్తి
- కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేటలో మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ అధిక సామర్థ్యాన్ని కలిగి ఉందని, కోచ్‌లు, ఇంజిన్లు, మెట్రో రైళ్లను తయారు చేయడానికి అనువైన విధంగా రూపొందించబడిందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో పాటు ఇతర ప్రముఖులు, ప్రజా ప్రతినిధులతో కలిసి శనివారం కాజీపేటలోని రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను సందర్శించారు. వీరి వెంట దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్, దక్షిణ మధ్య రైల్వే ప్రధాన విభాగాల అధిపతులు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మీడియా ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ కాజీపేటలోని మెగా రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్యూనిట్ దాదాపు రూ.521 కోట్లతో అత్యాధునిక స్టేట్ ఆఫ్ ఆర్ట్ సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ కు సంబంధించిన నిర్మాణ పనులు ఈ సంవత్సరం డిసెంబర్ 2025 నాటికి పూర్తవుతుందన్నారు. మొత్తం ప్రాజెక్ట్ 2026 చివరి నాటికి పూర్తవుతుందని ఆయన తెలియజేశారు. మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో పనుల పురోగతి పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. భారతదేశం త్వరలో భారీ రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్, రైల్వే ఉత్పత్తి ఎగుమతి దేశంగా మారుతుందని ఆయన అన్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నాన్ని నెరవేర్చినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా దాదాపు మూడు వేల మందికి ప్రత్యక్షంగా, మరికొంత మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com